క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

కాజులూరు: ద్వారపూడి–యానాం రహదారిలో కుయ్యేరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు, యానాంకు చెందిన సొన్నపు రామారావు మోటారు బైక్‌పై ద్రాక్షారామ వెళుతున్నాడు. కుయ్యేరు వద్దకు వచ్చేసరికి కాలినడకన వెళ్తున్న వ్యక్తి అడ్డు రావటంతో సడన్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో రామారావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని యానాం ఆస్పత్రికి తరలించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ హరీష్

కపిలేశ్వరపురం: వ్యసనాలకు దూరంగా ఉండాలని, లేదంటే భవిష్యత్ సమస్యలమయం అవుతుందని విద్యార్థులను అంగర ఎస్‌ఐ జి.హరీష్ కుమార్ హెచ్చరించారు. కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు 'మత్తు పదార్థాల వినియోగం – వాటి దుష్ప్రభావాలు – నివారణ చర్యలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడడం ద్వారా ఆరోగ్యంతో పాటు సామాజిక గౌరవాన్ని సైతం కోల్పోతారన్నారు. కార్యక్రమంలో శక్తి టీం మహిళా కానిస్టేబుల్ విజయలక్ష్మి, కానిస్టేబుల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

రేపు విద్యుత్‌కు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని కాలేరు ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు, లైన్‌లు మరమ్మతు పనులు నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు మంగళవారం తెలిపారు. కాలేరు, సుభద్రాపురం, నల్లూరు, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రాజేష్ కుమార్‌కి సన్మానం



కాకినాడలో రాజేష్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం: అంగర ట్రాన్స్‌కో లైన్‌మన్ బళ్ల నవజీవన్ రాజేష్ కుమార్‌ను కాకినాడలో అక్కడి యువసేన స్వచ్ఛంద సేవా సమితి సోమవారం ఘనంగా సన్మానించింది. రాజేష్ కుమార్ ప్రేమ స్ఫూర్తి సహాయ పరిచర్య పేరుతో రక్తదాన శిబిరం, నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాటిని గుర్తించిన యువసేన స్వచ్ఛంద సేవా సమితి రాజేష్‌ని సత్కరించింది.

ఉద్యోగులకు సత్కారం



అంగరలో బదిలీ ఉద్యోగులను సత్కరిస్తున్న పీహెచ్‌సీ అధికారులు

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలో ఎంతో కాలంగా సేవలందించి బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళుతున్న ఉద్యోగులను మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో ఘనంగా సత్కరించారు. వైద్యాధికారి, డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించిన సత్కార కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న బి.శ్యామల రాణి, పి.ఝాన్సీ భాయ్, ఎం.దేవి, జీవీవీ లక్ష్మి, ఏఎన్ఎం గ్రేడ్ 3 నుంచి ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)గా ఉద్యోగోన్నతి పొందిన పి.శిరోమణి, సీహెచ్ దుర్గ, సీహెచ్ దేవిలను సత్కరించారు. వారి సేవలను కోనసీమ జిల్లా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ జె.మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీ మణి కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ నాని బాబు, ఎల్‌టీ అలీ, స్టాఫ్ నర్సు బంగారు పాప, ఫార్మాసిస్ట్ ప్రిస్కిల్లా, వైద్య, ఆరోగ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి

రామచంద్రపురం రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆదేశించారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ, హసన్‌బాద గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, వసతి గృహాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ద్రాక్షారామ పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశంలో పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు, కీటక జనిత వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ పీడీడీ బిషప్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్న సుధ, హెచ్‌ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి, హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంటతో ప్రయోజనాలెన్నో..

- గ్రామాల్లో పంట వివరాల నమోదుకు శ్రీకారం
- జియో ఫెన్సింగ్‌తో కచ్చితమైన వివరాలు
- 1.01 లక్షల ఎకరాల్లో వరిసాగు

రాయవరం: రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసేందుకు ఈ–పంట విధానాన్ని వ్యవసాయ శాఖ అందుబాటులోకి తెచ్చింది. నమోదు చేయించుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉంది. ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకోవాలంటే ఈ–పంటలో తప్పనిసరిగా సాగు వివరాలు నమోదు చేసుకోవాలి. గతంలో ఉన్న విధానంలో వ్యవసాయ శాఖ స్వల్ప మార్పులు చేసింది. గతంలో మాదిరిగానే ఈ ఏడాది ఈ–పంట నమోదులో జియోఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానంలో రైతుకు, కౌలు రైతుకు ప్రయోజనం ఉంటుంది. కచ్చితమైన సమాచారం ప్రభుత్వానికి చేరుతుంది.

కచ్చితమైన సమాచారం

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు అతివృష్టి, అనావృష్టితో తరచుగా నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో వారు పరిహారం పొందేందుకు అధికారులు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగేవారు. వీరి కష్టాలను గుర్తించిన ప్రభుత్వం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సిబ్బందితో రైతు ఫొటోతో పాటు పొలం వద్దే వివరాలు గతం నుంచీ నమోదు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా క్షేత్ర స్థాయిలో కచ్చితమైన సమాచారం కోసం జియోఫెన్సింగ్ విధానంలో రైతు పొలాన్ని గుర్తించే విధంగా 50 మీటర్ల నుంచి 20 మీటర్ల తగ్గించారు. కచ్చితంగా రైతు పొలం వద్దకే వెళ్లి, వివరాలు నమోదు చేస్తేనే యాప్‌లో ఎంటర్ అవుతుంది. దీని వలన ప్రభుత్వానికి కచ్చితమైన సమాచారం చేరుతుంది. ఈ–పంట ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయి. ప్రస్తుతం వ్యవసాయ సిబ్బంది ఈ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే తుది గడువును ప్రకటించలేదు.

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
ఆర్‌సీపీఎం	25	18,806	9,737
కె.గంగవరం	26	15,633	8,700
కాజులూరు	26	19,382	17,200
మండపేట	12	16,985	11,042
రాయవరం	12	14,646	12,002
కపిలేశ్వరపురం	19	16,333	7,200
మొత్తం	120	1,01,785	65,881



రాయవరంలో ఈ–పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ప్రయోజనం ఇలా

- ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం, కార్యక్రమం ఈ–పంట మీదనే ఆధారపడి ఉంటుంది.
- ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏయే పంటలు దెబ్బతిన్నాయో స్పష్టమవుతుంది. రైతుకు పంటల బీమాతో పాటుగా రైతుల పంట అమ్మకాలకు మద్దతు ధర లభిస్తుంది.
- ఇన్‌పుట్ రాయితీ, పంట బీమా, సున్నా వడ్డీకే పంట రుణాలు తదితర ప్రయోజనాలు పొందే వీలుంటుంది. ఎరువులు, యాంత్రీకీకరణ పరికరాలు తదితర పథకాలతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

నమోదు ఇలా..

రైతులు నేరుగా గ్రామ సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి సాగు చేసిన పంట, విస్తీర్ణం, సర్వే నంబరు, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, ఫోన్ నంబరు వివరాలతో నమోదు రిజిస్టేస్ చేయించుకోవాల్సి ఉంటుంది. తొలుత యాప్‌లో ఆధార్‌తో రైతుల పేర్లు ఎంటర్ చేస్తారు. వెంటనే రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో చూపిస్తాయి. ఈ–పంట యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేసిన అనంతరం క్షేత్ర స్థాయిలో రైతు పొలం వద్ద ఫొటోను ఈ–పంటలో నమోదు చేస్తారు. సర్వర్‌కు అప్‌లోడ్ చేయగానే రైతు వివరాలు ఈ–పంటలో నమోదవుతాయి. గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది కలసి సంయుక్తంగా ఈ పంట నమోదు చేయాల్సి ఉంది.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో ఖరీఫ్‌లో 1,01,785 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ–పంటను వ్యవసాయ శాఖ సిబ్బంది నమోదు చేస్తున్నారు. దీని ద్వారా ప్రత్యేక యాప్‌లో నమోదు చేయడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ–పంటలో నమోదైన రైతు సెల్‌కు డిజిటల్ ఎక్నాలెడ్జ్‌మెంట్ వెళ్తుంది. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా ఫిజికల్ ఎక్నాలెడ్జ్‌మెంట్ కూడా ఇవ్వనున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఈ–పంటలో ప్రతి రైతు తమ వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలి. రైతు సేవా కేంద్రాల ద్వారా సిబ్బంది నమోదు చేస్తారు. దీని ఆధారంగానే రైతులకు అందాల్సిన రాయితీలు అందుతాయి. ఈ నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా యంత్రాంగం పర్యవేక్షణ చేస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, మండపేట

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ఆలయ నూతన పాలకవర్గం

రామచంద్రపురం రూరల్: నరసాపురపుపేట గ్రామంలో ఉన్న భవానీ శంకరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. చైర్మన్‌గా టేకుమూడి వెంకటరమణ, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సర్పంచ్ చాత్రాది వీరలక్ష్మి, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మి, ఆలయ ఈఓ విత్తనాల శ్రీనివాస్, అర్చకుడు మద్దిరాల శ్రీనివాస దత్తు పాల్గొన్నారు.

స్కూలు నైట్ వాచ్‌మన్‌కు సత్కారం



సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

రామచంద్రపురం రూరల్: వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో నైట్ వాచ్‌మన్‌గా 30 ఏళ్ల పాటు సేవలందించిన నేదునూరి సుబ్బారావు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు దంపతులను ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం బి.వీరభద్రరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, వైద్య నిపుణుడు పాముల వీరభద్రరావు, ఎస్ఎంసీ చైర్మన్ సుంకర ఆదినారాయణ, పూర్వ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజల పక్షాన నిలబడాలి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజా క్షేత్రంలో ప్రతి నిత్యం ప్రజల పక్షాన నిలబడాలని ఇటీవల మండపేట నియోజకవర్గంలో వివిధ విభాగాల్లో పార్టీ పదవులను పొందిన వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. మండపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పదవులు పొందిన వారు ఎమ్మెల్సీ తోటను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పర్యవేక్షణలో క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. పార్టీలో నాయకులు, కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా నిలుస్తానని, అందరం కలిసి దుష్ట కూటమి పాలనను అంతమొందించుదామని ఎమ్మెల్సీ తోట పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీ కపిలేశ్వరపురం మండల కమిటీ అధ్యక్షుడుగా నియమితులైన గూటం సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోటను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మర్యాదపూర్వకంగా కలిసినివారిలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, పాలింగి శ్రీనివాస్, యర్రంశెట్టి నాగేశ్వరరావు, రాయుడు జగపతి, వాసంశెట్టి విష్ణు ఉన్నారు.

మండపేట పట్టణ నాయకుల కృతజ్ఞతలు

తమ సామాజిక వర్గానికి చెందిన 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాసును పట్టణ కమిటీ అధ్యక్షుడిగానూ, యాండ్ర ప్రభాకరరావును రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగానూ, జిల్లా యాక్టివిటీ కార్యదర్శిగా టేకుమూడి శ్రీనును నియమించినందుకు శెట్టిబలిజ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోటను కలిసిన వారిలో నాయకులు పెంకే గంగాధర్, మట్టపర్తి గోవిందరాజు, పంపన శ్రీనివాస్, పాలిక శ్రీను, పెంకే వెంకట్రావు, పాలిక గోవింద్, కుక్కల తిరుమలరావు, గుత్తుల లోవరాజు, చొల్లంగి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలుపుతున్న కపిలేశ్వరపురం మండల నాయకులు

దుకాణాలపై దాడులు

కపిలేశ్వరపురం (మండపేట): మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కమిషనర్ టీవీ రంగారావు ఆదేశాలపై మండపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్, వినియోగాన్ని నివారించాలన్న లక్ష్యంతో మంగళవారం ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఆధ్వర్యంలోని సిబ్బంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్, 75ఎంటీక్రాన్స్ కంటే తక్కువ మందంగల పాలిథిన్ కవర్లను వాడుతున్న వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహించారు. పట్టణంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లు, బేకరీల్లో ఆహార పదార్థాలు తయారీలో నాణ్యత లోపాన్ని గుర్తించేందుకు తనిఖీ చేపట్టారు. 35 షాపుల్లో తనిఖీలు నిర్వహించి 15 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, 10 కేజీల ప్లాస్టిక్ క్యారీ బేగ్‌లు, ప్లాస్టిక్ గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో పాడైన కోడి గుడ్లను గుర్తించి పారవేయించారు. పలు షాపుల నుంచి రూ.4,600 అపరాధ రుసుంను వసూలు చేశారు.



పట్టణంలోని బేకరీలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ముత్యాల సత్తిరాజు

కార్పొరేట్ కనుసన్నల్లో పాలన

- స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అఖిలపక్ష నేతల ధర్నా

కాజులూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో పనిచేస్తూ, వారి అభివృద్ధి కోసం ప్రజా జీవితాలను పణంగా పెడుతున్నాయని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ చార్జీల పెరుగుదలకు నిరసనగా మంగళవారం ఆర్యావటంలోని గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ వద్ద అఖిలపక్ష నేతల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్, రాజబాబు మాట్లాడుతూ, అదాని కంపెనీకి లాభం చేకూర్చేందుకు ప్రజలపై భారాన్ని మోపుతూ, స్మార్ట్ మీటర్ల పేరుతో ఉచ్చు బిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయన్నారు. స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి వస్తే, దశలవారీగా వినియోగదారుడిపై పెను భారం తప్పదన్నారు. ప్రీపెయిడ్ ద్వారా ముందే రీచార్జ్ చేసుకోవాలని, పీక్ అవర్స్‌లో చార్జీలు పెరుగుతాయని ఒప్పందాల్లో ఉందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి అనేక కష్టాలు స్మార్ట్ మీటర్ల ద్వారా రాబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, సేవాదళ్ మండల కన్వీనర్ పాలిక వీరబాబు, గ్రామ కమిటీ చైర్మన్ దంగేటి వెంకన్న, కోనసీమ బీసీ సంఘం కన్వీనర్ కడలి రాంపండు, ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

విద్యుత్ చార్జీల నిలుపు దోపిడీ ఆపాలి

రామచంద్రపురం: బలవంతంగా బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను తక్షణమే నిలుపుదల చేయాలని, ట్రూ–అఫ్ చార్జీల పేరుతో విద్యుత్ భారాలను ప్రజలపై మోపవద్దని డిమాండ్ చేస్తూ వామపక్ష ప్రజా సంఘాల ప్రజా వేదిక రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో మంగళవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ తదితరులు మాట్లాడారు. ఆయా సంఘాల నాయకులు వి.భీమశంకరం, ఎ.కృష్ణ, సత్తిబాబు, నాగరాజు, వెంకటరావు, ఆదిలక్ష్మి, జి.రాజు, బి.సత్యనారాయణ, ఎ.మాచవరం, మీసాల గోపి, ఎస్‌వీవీ సత్యనారాయణ, మహిళా సమాఖ్య నాయకురాళ్లు ఎస్.శారదాదేవి, వై.నాగమణి, ప్రజానాట్య మండలి నాయకులు ఎం.ప్రేమానందం, తదితరులు పాల్గొన్నారు.



ఆర్యావటంలోని గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

శ్రీలంక నుంచి సురక్షితంగా తీసుకొస్తాం

కె.గంగవరం: మండలంలోని మసకపల్లి గ్రామానికి చెందిన కర్రి నూకరాజు కాకినాడకు చెందిన మరో ముగ్గురితో కలసి బోటులో జీపీఎస్ పనిచేయకపోవడంతో బోర్డర్ క్రాస్ చేసి శ్రీలంక వైపు వెళ్లి పోవడంతో వారిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వీరిని విడిపించడానికి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కేంద్రంలో మాట్లాడి నాలుగు రోజుల్లో విడిపించి తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీ సతీష్‌బాబు పీఏ గౌరీ శంకర్ మంగళవారం మసకపల్లి గ్రామానికి వచ్చి నూకరాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పిల్లి కల్యాణ్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పెమ్మాడి సాల్మన్ రాజు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై ధర్నా

- ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

రామచంద్రపురం: ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జర్నలిస్టుల డిమాండ్స్ డే ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా చేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని, కొత్త అక్రిడిటేషన్లు వెంటనే మంజూరు చేయాలని, జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్రాంత జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్నట్టుగా జర్నలిస్ట్ పింఛను పథకాన్ని అమలు చేయాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టులకు ప్రమాద బీమా అమలు చేయాలని, హెల్త్ స్కీమ్ మరింత ప్రయోజనకరంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్ట్ యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ దేవరకొండ అఖిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి, రామచంద్రపురం నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాటే భీమశంకరం, జిల్లా ఉపాధ్యక్షులు బోడపాటి ప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి కుడుపూడి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంపల పృథ్వీరాజ్, రామచంద్రపురం నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా సంఘ అధ్యక్షుడు కె.కనకరత్నం, నియోజకవర్గ ప్రెస్ క్లబ్ కార్యదర్శి నరాల రాధాకృష్ణ, రామచంద్రపురం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ దేవానందం, ఏపీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, సీనియర్ పాత్రికేయులు రాయుడు, సాయిరామ్, దేవు మహేశ్వరరావు, బాషా, అంజి, శ్రీను, ఏడుకొండలు, వెంకటరమణ, రాము తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో అఖిలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఈ-గవర్నెన్స్‌పై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ గవర్నెన్స్ పై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. అంగరలో గ్రామ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీఓ ఆర్ మోహన్ ఆధ్వర్యంలో ఈ గవర్నెన్స్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్న బాబు, ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పుత్సల శ్రీనివాస్, నాయకులు పిల్లా బసవరాజు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తూ మంగళవారం మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థినుల ఎంపిక

రామచంద్రపురం: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పట్టణంలోని జెడ్పీ స్కూలు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం కె.కుసుమ లక్ష్మీకుమారి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 3న జరిగిన కోనసీమ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్‌లో సీహెచ్ అభిలాషిత ఉత్తమ ప్రతిభను కనబర్చి అంతర్ జిల్లా పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అలాగే డి.అలేఖ్య షాట్‌పుట్‌లో మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అండర్–16 హైజంప్‌లో బి.భానుమతి రెండో స్థానం, 600 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు, ఉపాధ్యాయులు డీసీ అప్పారావు, మైథిలీ, పీడీ రాఘవ, పాఠశాల కమిటీ చైర్మన్ స్వర్ణలత, వైస్ చైర్మన్ సత్తిబాబు తదితరులు అభినందించారు.

తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ సామాజిక బాధ్యత

కపిలేశ్వరపురం: తల్లీ బిడ్డల ఆరోగ్య రక్షణ సామాజిక బాధ్యత అని తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. మండపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తల్లిపాల ఆరోగ్య ప్రాధాన్యాన్ని వివరించారు. చిన ద్వారపూడిలో ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ గర్భిణీ, బాలింతలు, చిన్నారులు తీసుకునే ఆహారం శాస్త్రీయ పద్ధతిలో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహనతో మెలగాలన్నారు.

రాయవరం: మండలంలోని చెల్లూరులో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో సర్పంచ్ పాలిక రాఘవ, సూపర్‌వైజర్ ఈశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తల్లిపాలు బిడ్డకే కాదు, తల్లికి కూడా శారీరకంగా, మానసికంగా రక్షణ లభిస్తుందన్నారు. అలాగే మాచవరం సెక్టార్ పరిధిలోని సోమేశ్వరం గ్రామంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విష్ణుకుమారి పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలగతోడు పీఏసీఎస్‌కు ఉత్తమ గుర్తింపు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం వెలగతోడు వ్యవసాయ సహకార సంఘానికి జిల్లా స్థాయిలో 2024–25 సంవత్సరానికి గాను ఉత్తమ పీఏసీఎస్ గుర్తింపు దక్కింది. సంఘం పరిధిలో నూరు శాతం బకాయిలు రికవరీ చేయడంతో ఈ గుర్తింపు దక్కినట్టు సహకార సంఘం సీఈఓ వంకా కృష్ణమూర్తి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ (ఆప్కాబ్) 62వ వార్షికోత్సవాలను సోమవారం రాత్రి విజయవాడలో నిర్వహించారు. రాష్ట్ర సహకార శాఖ మంత్రి కింజారపు అచ్చెంనాయుడు చేతుల మీదుగా రూ.20వేలు ఫిక్సిడ్ డిపాజిట్ రూపంలో అవార్డును సీఈఓ కృష్ణమూర్తి అందుకున్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, కాకినాడ డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, డీసీసీబీ సీఈవో ప్రవీణ్ కుమార్ సమక్షంలో అవార్డు అందుకున్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ వల్లూరి వీరవెంకట సత్యనారాయణ, సభ్యులు సత్రాకుల అబ్బులు, బోనగిరి సూర్యారావు, రైతులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేసారు.

కొండమూరి సేవలు మరువలేనివి

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన డాక్టర్ కొండమూరి నరసింహారావు వైద్య సేవలు మరువలేనివని ఆయన ఐదో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. అంగరలో మంగళవారం గంగుమళ్ళ వెర్రియ్య ఆధ్వర్యంలో ఆయన నిలువెత్తు విగ్రహానికి గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఆయన శిష్యులైన పీఎంపీ వైద్యులు నివాళులర్పించారు. రామచంద్రపురం అమృత రక్ష హాస్పిటల్ అధినేత రఘువీర్ కాంత్ ముఖ్య అతిథిగా హాజరై కొండమూరి సేవలను కొనియాడారు.